గురువారం 16 అక్టోబర్ 2025 5 విజయనగరం



జాతీయ స్థాయి పోటీలకు సంస్కృత పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
స్థానిక ప్రభుత్వ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాల విద్యార్థి పి.దుర్గాప్రసాద్ ఇటీవల రాజమండ్రి లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ లో బాక్సింగ్ విభాగం లో గోల్డ్ మెడల్ సాధించి, అరుణాచల్ ప్రదేశ్ లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.అప్పారావు, పీడీలు ఆర్.వాణిశ్రీ, వి.శ్రీగౌరీ తదితరులు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణ మృదంగం కొనసాగుతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినుల అనారోగ్య సమస్య, ఇద్దరు మరణానికి దారి తీసిన సంఘటన మరువక ముందే సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలోనూ మరణాలు సంభవిస్తున్నాయి. విద్యార్థుల అనారోగ్యం, పలు రోగాల బారిన పడడం వంటి పరిణామాలకు మూల కారణాలను ప్రభుత్వం నిర్ధారించిన తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది.


చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

17 మంది విద్యార్థులు మరణించినా స్పందించరా?

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతవరకు 17మంది గిరిజన విద్యార్థులు మరణించారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తాడంగి చిన్నారి కూడా పచ్చకామెర్లతో మరణించాడు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం చేపట్టి, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి.

– అఖిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

మన్యంలో మరణ మృదంగం

మంత్రి ఇలాకాలో పక్షంలో నలుగురు విద్యార్థులు మృతి ● పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-పార్వతీపురం, మక్కువ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు జిల్లాలో సుమారు 17 మంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని కారణంగా విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడటం, ఆలస్యంగా వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టడం వంటి చర్యల వల్ల మరణాల వరకు పరిస్థితులు వెళుతున్నాయి. ఏజెన్సీ మండలాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో రక్షిత తాగునీటి సరఫరా జరగడం లేదు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం వాటిని మరమ్మతు చేయించలేదు. దాదాపు అన్ని ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లోని వాటర్ ప్లాంట్లన్నీ మూలకు చేరాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. ఇంతవరకు వాటికి మరమ్మతులైనా చేయాలి. లేదా కొత్త వాటర్ ప్లాంట్లైనా మంజూరు చేయాలి. అలాంటి చర్యలు తీసుకోకుండా అధికారుల మొక్కుబడి సందర్శనలు, పరిశీలనలతో కాలయాపన చేయడం వల్ల కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లు విజృంభించాయి. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంపై గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎఎన్‌ఎంల నియామకం చేపడతామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పి ఏడాదిన్నర కావస్తోంది. ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు.

మంత్రి ఇలాకాలో పక్షంలో నలుగురు మృతి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే కేవలం పక్షం రోజుల వ్యవధిలో నలుగురు గిరిజన విద్యార్థులు మరణించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లోని కెజిబివి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారు. దసరా సెలవుల తర్వాత నలుగురు విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణించడం చర్చనీయాంశమవుతోంది. మక్కువ మండలంలోని నంద గ్రామానికి చెందిన బిడ్డిక కీర్తన పాచిపెంట కెజిబివిలో ఇంటర్మీడియట్ చదువుతూ అనారోగ్యానికి గురైంది. కొద్దిరోజుల క్రితం కీర్తన మరణించింది. పాచిపెంట మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని కొట్టిశ శాంత జ్వరంతో మరణించింది. సాలూరు మండలంలోని మామిడిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని తాడంగి పల్లవి దసరా సెలవులకు ఇంటికి వెళ్లి అనారోగ్యానికి గురైంది. బొబ్బిలి మండలంలోని కృపావలస గ్రామానికి చెందిన పల్లవిని తల్లిదండ్రులు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందించారు. అప్పటికీ నయం కాకపోవడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ కూడా మెరుగుపడకపోవడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలించారు. ఈ నెల 12న పల్లవి కెజిహెచ్‌లోనే మృతి చెందింది.

మక్కువ మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి పనసబద్ర పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన తాడంగి చిన్నారి బుధవారం మరణించాడు. చిన్నారి ఆరోగ్యం బాగోలేదని పాఠశాల సిబ్బంది ఆలస్యంగా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పరిస్థితి మెరుగు పడకపోవడంతో విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇంకా మెరుగైన చికిత్స కోసం బుధవారం వేకువజామున విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలిస్తుండగా చిన్నారి మార్గం మధ్యలో మృతి చెందాడు.

రూ.50లక్షలు పరిహారమివ్వాలి : సిపిఎం

మన్యం జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వరుస మరణాలతో వణికిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, పాలకులు చలించని పరిస్థితి నెలకొందని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి తాడంగి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ మన్యం జిల్లా పరిధిలో ఆశ్రమ పాఠశాలలో నేటి వరకు మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న పలు ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలను

ప్రయివేటీకరణ చేయొద్దు

ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థను కొనసాగించాలి
రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
పేదలకు వైద్యం అందాలంటే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరం చేయవద్దని, పీపీపీ విధానం వెనక్కి తీయిసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు యుఎస్ రవికుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలుసంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని పూర్తిగా పిపిపి మోడల్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకోవడానికి చూస్తోందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఐదు కాలేజీలు ప్రారంభించిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూడటం సరికాదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య భారంగా మారనుందన్నారు. ఫీజులు కట్టుకోలేక పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబిసి రిజర్వేషన్లు పోతాయని, వైద్యం కూడా మరింత ఖరీదుగా మారిందన్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ నిధులు మంజూరు చేయకపోవడం వలన వైద్యం అందక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలని, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పిహెచ్‌సి వైద్యులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, డాక్టర్ కె.నాగమనోహర్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ నవీన్, డాక్టర్ అల్లు హేమంత్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్, జిల్లా అధ్యక్షుడు ఎంవిఎన్ వెంకటరావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్, ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఏపి మెడికల్ రెప్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భగవాన్, సుధీర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అర్.ఆనంద్, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంఘం నాయకులు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ పార్కు స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస
జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిపై కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి దృష్టి సారించారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధిని బుధవారం పరిశీలించారు. ముందుగా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి కొత్తవలస మండలం బలిఘట్టంలో నిర్మాణంలో ఉన్న ఎంఎస్‌ఎంఇ పార్కును సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. మ్యాప్‌లను పరిశీలించారు. ఈ పార్కుకు సుమారు 57.09 ఎకరాలను కేటాయించడం జరిగిందని, దీనిలో తొలిదశ కింద 22 ఎకరాల్లో 82 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని ఎపిఐఐసి అధికారులు వివరించారు. ఒక్కో ప్లాటు విస్తీర్ణం 300 చదరపు మీటర్లు ఉంటుందని, రోడ్లు, కాలువలు తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కేటాయించిన 57 ఎకరాలు పోను, మిగిలిఉన్న 13 ఎకరాలను కూడా ఎపిఐఐసికే అప్పగించాలని కొత్తవలస తాహసీల్దార్ అప్పలరాజును కలెక్టర్ ఆదేశించారు. బొండపల్లి మండలం కొండకిండాంలో నిర్మితమవుతున్న ఎంఎస్‌ఎంఇ పార్కును కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడి పార్కుకు కూడా మొత్తం 57 ఎకరాలకు కేటాయించినట్లు తాహశీల్దార్ రాజేశ్వరరావు తెలిపారు. సంబంధిత మ్యాపులను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పార్కులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎపిఐఐసి డిజెడ్‌ఎం జయచంద్ర, జెఈ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.


ఎంఎస్‌ఎంఇ పార్కు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీచేయాలి

నిరుద్యోగుల ధర్నాలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేసి రెండు లక్షలమంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రామన్న హెచ్చరించారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయనగరంలో గురజాడ లైబ్రరీ నుంచి కోట జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తీసుకోరావాలని కోరారు. గ్రంథాలయలకు సొంత భవనలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగుల సంఖ్య రెండు లక్షలకు చేరుకుంది, వారికి నోటిఫికేషన్ ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న లైబ్రరీ సెస్ ను జమ చేయాలని అన్నారు. మూత పడిన లైబ్రరీలను పునరుద్ధరించి, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త లైబ్రరీలను ఏర్పాటు చేయాలని కోరారు. మూడు దశాబ్దాల కాలంగా రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున వయో పరిమితి 47కు పెంచాలని,గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్, మెడికల్ కాలేజీల్లో లైబ్రరీలో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో గ్రంధాలయాల అభివృద్ధి కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సతీష్, తిరుపతి, నిరుద్యోగులు వెంకట్ రమణ, ఆదిత్య, రాజు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు


కోట వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

కలాం ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి కంటోన్మెంట్
అబ్దుల్ కలామ్ ఆశయమైన 2047కు భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి గా గుర్తింపు పొందాలంటే యువత సామాజిక భాద్యతగా పని చేయాలని మై భారత్ జిల్లా యువజన అధికారి ప్రేమ్ భరత్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కణపాక యూత్ హాస్టల్ లో ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్,సహకార భారతి,మాత్రుభూమి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కలామ్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక రంగాల్లో సామాజిక సేవలు చేస్తున్న స్వచ్ఛంధ సంస్థలు ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం హర్షణీయమని అన్నారు. మమ్ముల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లోక్ సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సహకారభారతి రాష్ట్ర అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.


మాట్లాడుతున్న ప్రేమ్ భరత్‌కుమార్

ఆనంద్ కుటుంబానికి రూ.5 లక్షలు బీమా అందజేత

ప్రజాశక్తి-విజయనగరంకోట
ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన విజయనగరం కొత్తపేట కుమ్మరి వీధి కు చెందిన టిడిపి కార్యకర్త అల్లాడ ఆనంద్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతి రాజు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన ప్రమాద భీమా రూ. 5లక్షలు వారి బ్యాంకు ఖాతాకు జమ అయిన సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన సందేశాన్ని వారికి అందజేశారు.ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద భీమా సౌకర్యం పార్టీ కల్పిస్తోందన్నారు.

వైద్య కళాశాలను త్వరగా పూర్తి చేయాలి

జిజిహెచ్‌లో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్
ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. మెడికల్ కాలేజీ నిర్మాణం, ఇతర అంశాలపై తమ ఛాంబర్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత భవనాల నిర్మాణ పరిస్థితి, ఆసుపత్రి భవనం, హాస్టల్ భవనాల నిర్మాణం గురించి ఆరా తీశారు. ఇప్పటివరకు జరిగిన పనులు, మొత్తం పూర్తి కావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందీ తదితర అంశాలను తెలుసుకున్నారు. పనుల వేగాన్ని పెంచి భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిపై సమీక్షించారు. ఆసుపత్రి మరమ్మతులకు, లోపల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏపిఎంఎస్‌ఐడిసిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఏపిఎంఎస్‌ఐడిసి ఇఇ భారతి పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి

పిఎంఎవై కింద మంజూరైన గృహాలను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హౌసింగ్ అధికారుల తో సమీక్షించారు. పిఎంఎవై కింద జిల్లాలో 8259 గృహాలు లక్ష్యం కాగా 6873 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన 1386 గృహాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముందుగా అర్బన్ లో సొంత స్థలాలు ఉన్న గృహాలను పూర్తి చేయాలని తెలిపారు. రూఫ్ లెవెల్ లో , ఆర్.సి స్థాయిలో ఉన్నవన్నీ పూర్తి కావాలని, ఇకపై ప్రతి వారం సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలలో నిర్మాణాలకు అనువుగా ఉన్నవాటిని గుర్తించి, అందుకు ఎంత మేరకు భూమి అవసరం అవుతుందో ప్రతిపాదన లు తయారు చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ ప్రసాద్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.50.13లక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా వచ్చిన చదురుగుడి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం అమ్మవారి కల్యాణ మండపంలో జరిగింది. హుండీ ఆదాయం రూ.50,13, 221 రాగా, బంగారం 35 గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 421 గ్రాములు వచ్చింది. హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ సహాయ కమీషనర్ కె. శిరీష, కార్యర్వహణాధికారి వై.శ్రీవాసరావు ఆధ్వర్యంలో జరిగింది.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
ఎఐజిడిఎస్‌యు జనరల్ సెక్రెటరీ మహాదేవయ్యను తిరిగి ఉద్యోగం లోకి తీసుకోవాలని , ఉద్యోగులను విభజించి పాలించే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని పోస్టల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. కేంద్రం నిరంకుశ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎన్ఎఫ్‌పిఎ ఆధ్వర్యంలో జిల్లా పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల శాఖ ఉద్యోగులు సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, వి.రుద్ర ప్రతాప్, బి.కిరణకుమార్, పెంట పాపయ్య, పెన్షన్ అసోసియేషన్ నాయకులు కె.నారాయణరావు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుంచి రకరకాలుగా అధికారులు దుర్వినియోగం చేస్తున్న డివోషన్ డ్యూటీ, ఇన్సోబోటేజ్ అనే పదాల అర్థం మీద కూడా ఈ పోరాటం చేస్తున్నామన్నారు. రెండేళ్లక్రితం చేసిన సమ్మెకు భాధ్యున్ని చేసి మహాదేవయ్యను ఉద్యోగం నుంచి తీసివేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. ధర్నాలో కె.ఈశ్వరరావు తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిపిఆర్ ప్రతిఒక్కరికీ తెలిసి ఉండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్
అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే సిపిఆర్ గురించి ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటిండెంట్, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ సూచించారు. వివిధ కారణాల రీత్యా ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం లేదా శ్వాస ఆగిపోయినప్పుడు అతని ప్రాణాలను రక్షించడానికి సిపిఆర్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న సిపిఆర్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా జిజిహెచ్‌లోని ఓపి విభాగం వద్ద సాధారణ పౌరులకు, సమావేశ మందిరంలో సిబ్బందికి బుధవారం అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. సిపిఆర్ వల్ల ప్రయోజనాలు, చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమాల్లో అనస్థీషియా హెచ్‌ఒడి డాక్టర్ జయధీర్, అత్యవసర విభాగం హెచ్‌ఒడి డాక్టర్ శివప్రసాద్, ఆసుపత్రి డిప్యుటీ సూపరింటిండెంట్ డాక్టర్ శివశ్రీధర్ పాల్గొని సిపిఆర్ గురించి వివరించారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సచివాలయాల వారీగా ఎంత మేర పన్ను వసూళ్ళు జరిగాయా అన్న విషయాలపై ఆరా తీస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ మొత్తాలను వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వసూళ్లు పెంచి, లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు.సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు,రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు అప్పలరాజు, వినోద్ కుమార్,చిన్నంనాయుడు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టిన కమిషనర్

కమిషనర్ పల్లి నల్లనయ్య నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. దుకాణాలలో ప్లాస్టిక్ విక్రయాలు గాని వినియోగం గానీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు పొందారా లేదా అన్న విషయాన్ని దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. లేని పక్షంలో తక్షణమే ట్రేడ్ లైసెన్సులు పొందాలని సూచించారు.

సిటియు అధ్యాపకులకు యుకె పేటెంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి మరో ప్రతిష్ఠాత్మక ఘనత లభించింది. విశ్వవిద్యాలయ అధ్యాపకులు రూపొందించిన 'డిజిటల్ ప్లాట్‌ఫామ్ కంప్యూటర్ ఫర్ ట్రైబల్ ఎకానమీ ఎన్‌హాన్స్‌మెంట్' అనే ఆవిష్కరణకు యునైటెడ్ కింగ్‌డమ్ పేటెంట్ మంజూరైంది. యూనివర్సిటీకి చెందిన డాక్టర్ గంగునాయుడు మండల, డాక్టర్ తారకేశ్వరరావు ఇప్పిలి, డాక్టర్ లతా కళ్యాంపూడి, డాక్టర్ దివ్య, డాక్టర్ కుసుమ్, డాక్టర్ ప్రమా చటర్జీ లు సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేశారు. ఆధునిక సాంకేతికత ద్వారా గిరిజన ఉత్పత్తులను, సేవలను, మరియు సంప్రదాయ జ్ఞానాన్ని గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. అధ్యాపక బృందాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా అభినందించారు.

ఎంఎస్‌పి కంటే తక్కువకు విక్రయించొద్దు

21 తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి రవికిరణ్

ప్రజాశక్తి-విజయనగరంకోట
రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాలకు కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా వుందని, రైతులు పత్తి, మొక్కజొన్న పంటలను ఎంఎస్‌పి కంటే తక్కువ ధరకు విక్రయించవద్దని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగు అధికారి బి.రవికిరణ్ తెలిపారు. జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశం ఈనెల 10న జరిగిందని, ఆ సమావేశంలో సిసిఐ ద్వారా గుర్తించిన పత్తి కొనుగోలు కేంద్రం రాజాం వద్ద ప్రారంభించేందుకు నిర్ణయించామని తెలిపారు. పత్తి రకాల ఆధారంగా అక్టోబరు 21వ తేదీ తర్వాత జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. పత్తి ధర క్వింటాకు రూ.8110, మొక్క.జొన్న క్వింటాల్ కు రూ.2400 ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ లో పత్తి ధర రూ.6వేలు నుంచి రూ.6700 వరకు, మొక్కజొన్న ధరరూ.2వేలు నుంచి రూ.2200 వరకు నాణ్యత ఆధారంగా మారుతోందన్నారు. రైతులు పత్తి, మొక్కజొన్న కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు విక్రయించవద్దని విజ్ఞప్తి చేసారు.



డేటాల్ బానేగా స్వస్త్ ఇండియా క్యాంపెయిన్, డేటాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలోని ఆదిత్య పబ్లిక్ స్కూల్‌లో ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ అల్లు ఉమా నాయుడు, డైరెక్టర్ కళ్యాణి, కో ఆర్డినేటర్ రూప, వ్యాయామ ఉపాధ్యాయుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు. - ప్రజాశక్తి, విజయనగరంటౌన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

యువత భవిష్యత్తు గూగుల్ : ఎంపి

ప్రజాశక్తి-విజయనగరం కోట
యువత భవిష్యత్తుకు గూగుల్ డేటా సెంటర్ దోహదం చేస్తుందని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో గూగుల్ సెంటర్ ఏర్పాటుకు మంగళవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 16 నెలలోనే గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఉత్తరాంధ్రలో భోగాపురం ఎయిర్‌పోర్టు, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో అభివృద్ధి పథంలో వెళ్తుందన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్ష వైసిపి ప్రతిస్పందించకపోవడం హేయమైన చర్య అన్నారు. గత ఐదేళ్లలో వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. మద్యం కుంభకోణంలో జరిగిన అవకతవకలపై సిట్ వేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడంతో వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు గంటా రవి, విజయనగరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పైన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పి దామోదర్

ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి : ఎస్పి

ప్రజాశక్తి -కొత్తవలస

పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల గౌరవంగా ఉండాలని ఫ్రెండ్లీ పోలీసింగ్ పద్ధతిలో వారితో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి మార్గం చూపాలని జిల్లా ఎస్పి దామోదర్ పోలీసులకు సూచించారు. బుధవారం కొత్తవలస పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎన్‌డిపిఎస్, పోక్సో కేసులు, మహిళా కేసులు ఎలా ఉన్నాయి? ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా అని ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ కొంత శిథిలావస్థకు చేరిందని స్థానికంగా ఉన్న పరిశ్రమల ద్వారా నిర్మించే ప్రయత్నం చేయాలని ప్రభుత్వం వైపే చూడకుండా ఉండాలని సిబ్బందికి సూచించారు.

ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అమర్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. చదువు కోసమని పంపిస్తే ఎప్పుడు మరణ వార్త వినాల్సివస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయక పోవటం ఒక కారణమైతే, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం మరో కారణమన్నారు. పాఠశాలల్లో రోజిక వసతులు సరిగా లేకపోవడం, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి వసతి గృహానికి ఆరోగ్య సేవలు అందించే ఆరోగ్య కార్యకర్తలను నియమించాలన్నారు.

సీనియర్ జర్నలిస్టు బొర్రాకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన గజపతినగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఏపియుడబ్ల్యూజే జిల్లా మాజీ అధ్యక్షుడు బొర్రా వెంకట సత్యనారాయణ మృతికి ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్‌క్లబ్‌లో సంతాపసభ జరిగింది. సత్యనారాయణ ప్రారంభంలో ఈనాడు దినపత్రికలో ఆ తర్వాత ఆంధ్రప్రభలో, సుదీర్ఘకాలం ఆంధ్రభూమిలో గజపతినగరం విలేకరిగా పని చేశారని గుర్తు చేశారు. ఏపియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షునిగా రెండేళ్లు పనిచేశారన్నారు. యూనియన్ ప్రతినిధులు పలువురు జర్నలిస్టులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని మననం చేసుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు పిఎస్ఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర మహాపాత్రో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సిపిఆర్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహారాజ వైద్య విద్య కళాశాలలో సిపిఆర్‌పై సామాన్యులకు బుధవారం అవగాహన కల్పించారు. మిమ్స్ అనస్థీషియా మత్తు విభాగాధిపతి డాక్టర్ అన్నపూర్ణ శర్మ, ఇతర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈ నెల 13నుంచి 17వరకు జరుగుతున్న సిపిఆర్ పై అవగాహనలో భాగంగా సమస్యలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఒక వ్యక్తికి గుండె కొట్టుకోవడం లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు, ప్రాణాలను రక్షించడానికి చేసే అత్యవసర ప్రక్రియ సిపిఆర్ అంటారని చెప్పారు. అనంతరం సామాన్య ప్రజలకు, నర్సింగ్ వైద్య విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు.

తుప్పలను తొలగించిన ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - దత్తిరాజేరు

మండలంలోని ఎన్‌హెచ్ 26 జాతీయ రహదారి నుండి షికారు గంజి గ్రామం వరకు ఐదు కిలో మీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను జెసిబితో బుధవారం ఆటో డ్రైవర్లు తొలగించారు. ఆటో యూనియన్ సభ్యులు భాష, బలరాం వెంకటి మాట్లాడుతూ ఎస్ బూర్జువలస ఎస్ఐ రాజేష్ ఆదేశం మేరకు ఈ పనులు చేపడుతున్నామన్నారు. వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకే తుప్పలను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ కోరారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన తహశీల్దార్ ఎం.రమామణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పులు చేసి వండిపెట్టడం కష్టంగా ఉందన్నారు. వీరికి 2019 నుండి కేవలం రూ.3వేలు జీతం మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని మిగతా స్కీముల్లో పనిచేస్తున్న వర్కర్ల వలె వారితో సమానంగా జీతాలు చెల్లించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలు సరిపోవడం లేదని మెనూ ధరలను పెంచి వంట గ్యాస్ ను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కృపావలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -బొబ్బిలి రూరల్

మండలంలోని కృపావలసలో బుధవారం పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 12న గిరిజన విద్యార్థిని పల్లవి జ్వరంతో మరణించడంతో గ్రామంలో హెల్త్ సూపర్‌వైజర్ కన్నయ్య, హెల్త్ అసిస్టెంట్ తవిటినాయుడు, ఈశ్వరరావు ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా పరీక్షలు చేశారు. 38 మందికి రక్త పరీక్షలు చేయగా ఎవరికి ఎటువంటి జ్వరం లేదని చెప్పారు. వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

లే అవుట్లు కమబద్ధీకరణ చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ బి. జయరాం కోరారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అనధికార లే ఔట్ల వివరాలు నోటీసు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జరజాపుపేట పరిధిలో 10.91 ఎకరాలు, పూడిపేట తల్లి లే అవుట్ నెల్లిమర్ల కోర్ట్ వీధి వైన్ షాప్ వద్దన 98సెకరాలు భూమి అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని నోటీసు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇ-క్రాప్‌కు చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -విజయనగరంకోట

నెల్లిమర్ల మండలం రామతీర్థం శ్రీ రామ స్వామి దేవాలయం పరిధిలో తంగుడు బిల్లి, దన్నానపేట, సీతారాముని పేట, గొర్ల పేట గ్రామాల రైతులు సాగు చేస్తున్న సుమారు 700ఎకరాల భూమికి ఇ-క్రాప్‌చేసేందుకు అవకాశమివ్వాలని డిఆర్‌ఒకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు బుధవారం వినతి అందజేశారు. ఇ-క్రాప్ చేయకపోవడం వల్ల పంట కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకునే అవకాశం ఉండడం లేదని తెలిపారు. వెంటనే ఇ-క్రాప్ నకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతినిచ్చిన వారిలో దేవాదాయభూములు సాగు దారుల సంఘం జిల్లా కన్వీనర్ కుమిమినేని వెంకట రమణ, సర్పంచ్ తంగుడు బిల్లి, రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఆదేశాలు బేఖాతర్!

ఉదయం పరిశీలించిన ఎంఆర్ఒ ● రాత్రికి మళ్లీ కాలువ కప్పేసిన ఆక్రమణదారులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శ్రీనివాస కాలనీ గుండ ప్రవహిస్తున్న పుణ్యగిరి గెడ్డ ఆక్రమణకు గురవుతుందని మంగళవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు, మేజర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి అనురాధ వచ్చి గెడ్డను పరిశీలించిన విషయం తెలిసిందే. గెడ్డ స్థలం ఆక్రమణకు గురైనందున గెడ్డ కాలువలా బక్కచిక్కిపోయిందని పూడిక తీసివేసి ఆక్రమణలను తొలగించాలని పంచాయితీ కార్యనిర్వహణాధికారి అనురాధకు ఆయన సూచించి వెళ్లినప్పటికీ మంగళవారం రాత్రి సమయంలో జెసిబితో గంగరాజు అనే వ్యక్తి రహదారిపై మట్టిని కాలువలోకి వేసి రహదారిని విస్తరించాడు. దీంతో ఉదయం తహశీల్దార్ ఆదేశించినా బేఖాతర్ చేస్తూ రాత్రులు మరలా కాలవను కప్పేయడంతో ప్రభుత్వ గెడ్డలు కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కఠిన చర్యలు కానరాక పోవడంతో అధికారులు చేతగాని వారిలా ప్రజల్లో ముద్రింపబడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

పుణ్యగిరి గెడ్డను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

పుణ్యగిరి గెడ్డ ఆక్రమణలు పరిశీలించాం. పక్కా భవనాలు నిర్మించిన చోట గెడ్డ నీరు పోయేందుకు లోతుగా పూడిక తీయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. మరికొన్ని ప్రదేశాలలో గెడ్డ ఆక్రమణకు గురవుతుందని ఫిర్యాదులు వస్తున్నాయి. పుణ్యగిరి గెడ్డను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎస్‌కోట



రాత్రి సమయంలో జెసిబితో గెడ్డను కప్పేస్తున్న ఆక్రమార్కుడు

ఎఎంసి చైర్మన్‌గా 'తాడ్డి' ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మెరకముడిదాం ఎఎంసి చైర్మన్‌గా తాడ్డి చంద్రశేఖర్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం యువతకు పెద్ద పీట వేస్తుందని దానికి దానికి తార్కానమే యువకుడు, విద్యావేత్త, ప్రజాదారణ ఉన్న నాయకుడు తాడ్డి చంద్రశేఖర్ కి కట్టబెట్టిన ఎఎంసి చైర్మన్ పదవి అని అన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన చందు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. రైతులకు అందుబాటులో ఉండి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. టిడిపి ప్రభుత్వం హయాంలో తోటపల్లి ప్రాజెక్టు ద్వారా వచ్చిన కాలువలతో 57 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని దీంతో రైతన్నలు సుభిక్షంగా బతుకుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్ నాయుడు, మండల నాయకులు కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కెంగువ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మద్యం నాణ్యత తనిఖీకి మొబైల్ యాప్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మద్యం నాణ్యత తనిఖీకి ప్రభుత్వం ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టినట్లు ఎక్సైజ్ సిఐ ఎం.వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం నాణ్యత తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా మీ సమీపంలో కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా కాదా అని సులువుగా తెలుసుకోవడానికి మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై వత్తినట్లయితే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలు అవుతుందని అప్పుడు మీరు కొనుగోలు చేసిన మద్యం సీసా మూతపై అతికించి ఉన్న హీల్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆ సీసా ఎక్కడ తయారైంది ఏ డిపో నుండి సరఫరా చేశారు? ఏ షాపులో మీరు కొనుగోలు చేశారో వంటి వివరాలు తెలుస్తాయన్నారు. లిక్కర్ నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే 14405కి సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజాం: మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదా కాదా అని సులువుగా తెలుసుకోవడానికి ఎక్సైజ్ శాఖ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని రాజాం ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లో డౌన్లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై ఒత్తినట్లయితే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలు అవుతుందన్నారు. ఈ మొబైల్ యాప్ లిక్కర్ సీసాకి మాత్రమే వర్తిస్తుందని, లిక్కర్ నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 14405కి గానీ 9000248926 నెంబర్‌కి గానీ తెలియజేయాలన్నారు.

12 గంటల పని అన్యాయం : సిఐటియు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో పారిశుధ్య కార్మికులతో కాంట్రాక్టర్, ఆర్‌టిసి అధికారులు అతి తక్కువ జీతాలు ఇచ్చి 12 గంటల పనిచేయించుకోవడం చట్టప్రకారం నేరమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. కాంట్రాక్టర్ కనీస వేతనాలు చెల్లింపునకు కార్మికుల తరపున టెండర్ వెయ్యాలని, కనీస వేతనానికి తక్కువ వేస్తే ఆర్‌టిసి అధికారులు ఆ టెండర్లు తిరస్కరించాలని కోరారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు లేవని, అసలు టెండర్‌లో కార్మికులు సప్లై చేయడానికి ఒక్కో కార్మికుడికి ఎంత టెండర్ వేశారో కార్మికులకు తెలియదని చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో ఏ కార్మికులైన సప్లై చేస్తున్నప్పుడు చట్ట ప్రకారం కనీస వేతన చట్టం ప్రకారం టెండర్ వేయాలని, రూ.8,500 ఇచ్చి రోజుకు 12 గంటలు పని చేయించుకోవడం దారుణమని మండిపడ్డారు. తక్షణమే విజయనగరం డిఆర్‌ఎం జోక్యం చేసుకుని కార్మికులకు 8 గంటలు పని, కనీస వేతనం అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. గోపాలం కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు శంకరరావు

గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించాలి

గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. బొబ్బిలి మండలం కృపావలసలో అనారోగ్యంతో మృతి చెందిన గిరిజన విద్యార్థి పల్లవి కుటుంబ సభ్యులను బుధవారం సిపిఎం నాయకులు పరామర్శించి ఓదార్చారు. పల్లవి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాలలో సురక్షితమైన తాగునీరు లేకపోవడం, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కేంద్రాలు లేకపోవడంతో గిరిజనులు అనారోగ్యం బారిన పడుతన్నారని ఆరోపించారు. పల్లవి జ్వరంతో మృతి చెందిందంటే వైద్యం ఎలా అందుతుందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేసి సురక్షితమైన తాగునీరు అందించాలని, ఆశ కార్యకర్తను నియమించి అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి పౌష్టిక ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో గిరిజన సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఆయనతో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. గోపాలం వున్నారు.

బెల్ట్ షాపులపై నిఘా

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు బుధవారం భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో గల మద్యం షాపుల నిర్వాహకులకు భోగాపురం సిఐ దుర్గాప్రసాద్, రూరల్ సిఐ రామకృష్ణతో కలిసి సమావేశం నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ రవికుమార్ తెలిపారు. మద్యం షాపుల్లో నిర్వహించే అమ్మకాలు కేవలం ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే నిర్వహించాలని తెలిపారు. అనాధికార మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేయరాదని, ఒకవేళ మద్యం సరఫరా చేస్తే దుకాణ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా లిక్కర్ బాటిల్ మాత్రమే స్కాన్ అవుతుందన్నారు. బీరు బాటిల్ విషయంలో యాప్ పని చేయదన్నారు. ఈ సమావేశంలో దుకాణ నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ రవికుమార్

యూరియా కొరత లేదు : ఎడి

ప్రజాశక్తి - సంతకవిటి, రాజాం

రాజాం నియోజకవర్గంలోని యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ ఎడి కె.చంద్రరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి ఆమదాలవలస మండలల్లో ఇప్పటికే ప్రయివేటు దుకాణాల డీలర్ల ద్వారా 3,305 మెట్రిక్ టన్నులు యూరియ పంపిణీ చేశామన్నారు. దీంతో నియోజకవర్గ అన్నదాతలకు యూరియ కష్టాలు తీరాయన్నారు. రైతులు కోసం పొలం బడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంచి వ్యవసాయ అభ్యాసం (జిఎపి) మండలానికి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. మంచి దిగుబడి కోసం రైతులు నాణ్యమైన విత్తనాలు ప్రాంతాన్ని బట్టి ఎంచుకోవాలన్నారు. అన్నదాతలు ప్రతిరోజూ పొలానికి వెళ్లి పంటలను పరిశీలించాలన్నారు. పురుగు మందుల వాడకం తగ్గించాలని తెలిపారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి విత్తనాలు మార్చాలన్నారు. పాత విత్తనాలనే ఎక్కువ ఏళ్ళు వాడకూడదని తెలిపారు. రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారి సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.



వేపాడ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం వరకు గల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మిగిలి ఉన్న ఆరు కిలోమీటర్లు రోడ్డు పనులు చేసేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో బుధవారం ప్రస్తుతం రాకపోకలకు అసౌకర్యం కలుగుకుండా రోడ్డుకు ఉన్న ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించారు. వర్షాలు తగ్గిన వెంటనే పూర్తిస్థాయిలో పనులు చేపడతామని ఆర్‌అండ్‌బి జెఇ స్వామి తెలిపారు. సోంపురం గ్రామం నుంచి జాకేరు మీదుగా వేపాడ వరకు ఉన్న రోడ్డులో జాకేరు చెరువు గట్టు వద్ద 12 మీటర్ల రక్షణ గోడ, దబ్బిరాజుపేట కల్లాల వద్ద పది మీటర్లు రక్షణ గోడ పనులు కూడా వర్షాలు తగ్గిన వెంటనే ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.



గుంతలను పూడ్చుతున్న జెసిబి

పరిశుభ్రమైన చేతులతోనే వ్యాధుల నివారణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

పరిశుభ్రమైన చేతులతోనే వ్యాధుల నిరవాణ సాధ్యమని ఎంపిడిఒ జి. భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన చేతులే వ్యాధులను నివారించగలవని, అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆర్.రామారావు, ఎంఇఒ చంద్రశేఖర్, కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎస్ఒ గౌశ్యా బేగం, ఆరోగ్య సిబ్బంది జయలక్ష్మి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో సింగరాయి ప్రాథమిక, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం జీవిత చరిత్ర గురించి, వారి ఆశయాల గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డిబేట్ కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు, సోంపురం పాఠశాల హెచ్‌ఎం బిపిఏ రాజు, సింగరాయి పాఠశాల హెచ్‌ఎం, సింగరాయి వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారథి , ఏఎన్‌ఎంలు, సిఆర్‌పి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపించాలనీ ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన అధ్యక్షులు గేదెల గాయత్రి ఆధ్వర్యంలో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు హాజరై మాట్లాడారు. కార్యాలయం చుట్టూ ప్రహరీ, మొదటి అంతస్తులో సమావేశ మందిరం నిర్మించాలని సూచించారు. మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అధ్యక్షులు గాయత్రి మాట్లాడుతూ త్వరలోనే జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, డైరెక్టర్లు పెద్దల సూచనల మేరకు పలు తీర్మానాలు ఆమోదిస్తామన్నారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. తరువాత సమావేశంలో ఆదాయం, వ్యయాలు డైరెక్టర్లందరికీ పారదర్శకంగా తెలియజేయాలని కార్యదర్శికి సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గేదెల రాజారావుతోపాటు డైరెక్టర్లు ఎం. మోహన్‌రావు, పతివాడ రామనాయుడు, గరే వెంకటరమణ తదితర నాలుగు మండలాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు నీలిమ ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 11, 12 తేదీలలో విశాఖ జిల్లా మద్దిలపాలెం వద్ద గల ఆంధ్ర యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్ర ఇంటర్ యూనివర్సిటీ మహిళల కబడ్డీ పోటీలో పట్టణానికి చెందిన బుత్తల నీలిమ శ్రీరావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ ద్వారా పాల్గొని సౌత్ జోన్‌కు ఎంపికైందని కబడ్డీ కోచ్ ఆల్తి తాతబాబు బుధవారం తెలిపారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు చెన్నైలో జరగబోవు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా కబడ్డీ పోటీలలో నీలిమ పాల్గొంటుందని చెప్పారు. నీలిమ ఎంపిక పట్ల విజయనగరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవిపి రాజు, ప్రెసిడెంట్ రంగారావు దొర, సెక్రెటరీ కె.వి ప్రభావతి, రావి స్వరాజ్యం మెమోరియల్ కబడ్డీ క్లబ్ చైర్మన్ రావి శ్రీధర్ అభినందనలు తెలిపారు.



కోచ్‌తో నీలిమ

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని చంద్రంపేట వసంత గెడ్డ వాగులో సోమవారం రాత్రి గల్లంతైన సోమరాజు(53) మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం గాలించి మృతదేహాన్ని బయటకు తీసింది. తహశీల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ ఆధ్వర్యంలో మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు సోమరాజు ఆర్ వసంత గ్రామానికి చెందిన వ్యక్తి. నిరుపేద కుటుంబానికి చెందినవాడు. కుటుంబ పోషణ కోసం విజయనగరం పిడబ్ల్యు మార్కెట్లో ఏడు సంవత్సరాలు నుండి పని చేస్తున్నాడు. ఆర్ వసంత గ్రామం నుండి విజయనగరం టీవీఎస్ మోపెడ్ బండిపై వెళ్లి వచ్చేవారు. ఎప్పటిలాగే సోమవారం డ్యూటీకి వెళ్లి రాత్రి తిరిగి వచ్చిన సమయంలో ప్రమాదం జరిగి గెడ్డలో పడి గల్లంతై మృతి చెందాడు. మృతునికి భార్య రాజ్యలక్ష్మి కుమారుడు పురందేస్, కుమార్తె దీప్తి ఉన్నారు. గత సంవత్సరం ఇదే రోజులలో సందులూరు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తి ఇదే వాగులో గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే.

చంపావతిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక చంపావతి నదిలో ప్రమాద వసాత్తు వ్యక్తి పడి బుధవారం గల్లంతయ్యాడు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. జరజాపు పేటకు చెందిన కనకల అప్పారావు(46) అనే వ్యక్తి థామస్‌పేట పరిధిలో చంపావతి నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అప్పారావు భవన నిర్మాణ పనులు చేస్తూ పని లేని సమయంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు వంటలు చేయడానికి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో థామస్ పేట గ్రౌండ్‌లో పెళ్లి ఫంక్షన్ వంటకు వెళ్లి వంట పూర్తి అయిన తరువాత చంపావతి నదిలో తన సహచరుడు కిల్లంపల్లి రాజుతో కలిసి స్నానికి దిగి ప్రమాద వసాత్తు అప్పారావు గల్లంతు కాగా రాజు బయటకు వచ్చేశాడు. స్నానానికి దిగిన ప్రదేశంలో లోతుతో బాటు ఊబి కూడా ఉండడం ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్థానికులు నదిలో దిగి వెతికినా అప్పారావు ఆచూకి లభ్యం కాలేదు. బాధితుడుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని నగరపంచాయతీ కమిషనర్ జయరాం, ఎస్ఐ బి. గణేష్ పరిశీలించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

దేశాన్ని ప్రపంచపటంలో నిలిపిన వ్యక్తి కలాం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దేశాన్ని ప్రపంచ పటంలో నిలిపిన వ్యక్తి అబ్దుల్ కలాం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. కళాశాల చరిత్ర శాఖ, భౌతిక శాస్త్ర, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో సంయుక్తంగా మాజీ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ ఒక సామాన్యమైన ముస్లిం కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ తన లక్ష్యాన్ని సాధించి భారత అంతరిక్ష పరిశోధన చేసి భారత దేశాన్ని ప్రపంచ పటంలో నిలిపిన మహా వ్యక్తి అబ్దుల్ కలాం అని అన్నారు. కార్యక్రమంలో ఐక్యసి కోఆర్డినేటర్ డాక్టర్ వి.సుధీర్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఆర్ శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒ పి.భాస్కరరావు, చల్లా శ్రీనివాసరావు, డాక్టర్ సంధ్యారాణి, ఐ.దివ్య, లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం కోట :డాక్టర్ అబ్దుల్ కలాం గొప్ప రాజ నీతిజ్ఞుడని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. బుధవారం ఆ పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్రపై వకతృ వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు స్వతంత్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతులుగా ప్రదానం చేశారు అనంతరం కర్పాండెంట్ నారాయణరావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశ రక్షణ వ్యవస్థను ఎంతో అభివృద్ధి పరిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కలాం జయంతి సందర్భంగా తంగుడుబిల్లి జడ్‌పి హై స్కూల్ బోధకులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. భారత దేశానికి విశిష్ట సేవలు అందించిన శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అయిన కలాం జీవిత చరిత్ర విద్యార్థులకు గొప్ప ప్రేరణగా నిలుస్తోందని విద్య, క్రమశిక్షణ, కృషి పట్ల ఆయన చూపిన నిబద్ధతను విద్యార్థులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బంది బోధించారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL (JUNIOR DIVISION) JUDGE AT GAJAPATHINAGARAM
E.P.NO.7/2020 OS 557/2019

Between :
Tirunagari Balaram ....Decree Holder
And :
Gandreti Bhavani Sankar
...Judgement Debters

పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం Judgement Debters తాలుకా గల దిగువ షెడ్యూలు దాఖలా Dry Land యిస్థిహారు ప్రకారం పై కోర్టువారు **తే 23-10-2025దిన (గురువారం) పగలు గం॥ 10-30** నుండి బహిరంగముగ వేలం వేయుదురు.

కావున పాడుకొనదలచినవారు పై కోర్టువారు ఎదుట వేలంలో పాడుకొనవచ్చునని యిందుమూలంగా అందరికీ తెలియజేయడమైనది.

SCHEDULE

Vizianagaram District, Gajapathinagaram Sub-Registrar, Mentada Mandal, Kondalingalavalasa Village, Dry Land In sy. No.80, Extent of Ac.1.40 Cents.

Boundaries :
East : Kuneti Gedda, South : Dry Land of Appala Sriramulu, West : Rastha, North : Kuneti Gedda

సదరు పై హద్దుల మధ్యస్తమైన Dry Land కు వగైరా యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.

D.H.R Value of Rs. 3,00,000/-
Amin Value of Rs. 7,00,000/-
Market Value of Rs. 4,20,000/-
J.D.R Value not Furnished

Smt.I.Shree Challam
Advocate for the DHr
Cell: 9666238599

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.167/2023

Between:
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుగా గతంలో పిలువబడిన), మెయిన్ బ్రాంచ్, బొబ్బిలి తరపున బ్రాంచి మేనేజర్ బొబ్బిలి విజయనగరం జిల్లా. ......వాది
And:
అయినాల సూర్యారావు ......ప్రతివాది
To:-
ప్రతివాది:
అయినాల సూర్యారావు, తండ్రి లేటు వెంకటస్వామి, వయస్సు 69 సం.లు, నివాసము పారాది గ్రామము, బొబ్బిలి మండలము, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాను వాది దావా సొమ్ము రాబట్టే నిమిత్తము ప్రతివాదిపై దాఖలు చేసి యున్నాడు. సదరు దావాలో శ్రీ కోర్టు నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను, ప్రతివాది సమన్లు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలుకు సదరు దావాను తేది: 24.10.2025 నాడు వాయిదా వేసి యున్నారు.

కావున సదరు **తేది:24.10.2025 ఉదయం గం: 10:30 ని.లకు** పైన తెలిపిన కోర్టు నందు స్వయముగాగాని, వకీలు ద్వారాగాని, హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకోవలెను. లేని ఎడల పై దావాను మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)

బి.రవి
అడ్వకేట్,
బొబ్బిలి.

బొబ్బిలి,
తేది: 16.10.2025


వాటర్ క్యాన్లను వితరణగా అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎస్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, సిబ్బందికి బుధవారం నుంచి ఉచితంగా మినరల్ వాటర్ కేనులతో తాగునీటి సరఫరా చేసేందుకు చిన్న గుడిపాల గ్రామంలో ఏర్పాటు చేసిన శంకర వంశం బలరాం జనసేన్ సంస్థ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా మినరల్ వాటర్ కేనులను ట్రస్టు సభ్యులు సురేష్‌లు జల వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, సిఆర్పి సునందన పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు ఎఐ తొలిమెట్టు

ప్రజాశక్తి - చీపురుపల్లి


గద్దె బాబూరావు

యువత భవిష్యత్తుకు విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) తొలిమెట్టని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు అన్నారు. చీపురుపల్లిలో ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కృత్రిమ మేధ ఎఐ తీసుకురావడానికి నారా లోకేష్ జరిపిన కృషిని దేశ ప్రధాని సైతం అభినందించారన్నారు. గూగుల్ ఎఐ విశాఖపట్నం కేంద్రంగా మంజూరు కావడం వల్ల విద్య, వైద్యం, వ్యవసాయ తదితర రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎఐ వల్ల ప్రపంచ స్థాయిలోనే ఉత్తరాంధ్రకు గుర్తింపు కలుగుతుందన్నారు. రానున్న రెండు మూడు నెల్లలో చారిత్రాత్మక ఒప్పందానికి పలుదేశాలు ఆంధ్రప్రదేశ్‌లో క్యూ కడతాయని చెప్పారు. చంద్రబాబు పాలన తరువాత లోకేష్ రాష్ట్ర పరిపాలనకు పగ్గాలు చేపడతారని ఈ సందర్భంగా గద్దె అభిప్రాయం వ్యక్తం చేశారు.

జిఎస్‌టిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద గల బైక్ షోరూం సమీపంలో విజయనగరం రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు జిఎస్‌టి ఉపయోగాలు, రవాణా నియమాలు, వాహన భద్రత, పన్నుల చెల్లింపు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, షోరూం యాజమాన్యం, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


శ్మశానవాటికను పరిశీలిస్తున్న తహశీల్దార్

శ్మశానవాటిక పరిశీలన

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని జోడిమెరక, తమ్మన్న మెరక గ్రామాల శ్మశాన వాటిక కోసం దీర్ఘకాలంగా ఇరువురి గ్రామ ప్రజలు తగాదాలు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు ఇప్పటికే తహశీల్దార్ అప్పలరాజును కోరడంతో ఆయన బుధవారం శ్మశానవాటికను పరిశీలించారు. సర్వే నిర్వహించి గ్రామాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఘర్షణలు పడకుండా వారికి కేటాయించిన స్థలంలో వాడుకోవాలని, శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని శ్మశాన వాటికను ఆధునీకరణకు గ్రామస్తులందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ పరిశీలనలో సర్పంచ్ రాములమ్మ, ఆర్ఐ, విఆర్ఒ, సుధీర్ తదితర సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సారిపల్లి రహదారిలో సిసి కెమెరాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి రహదారిలో దాతలు సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నెల్లిమర్ల గ్యాస్ గోడౌన్ నుంచి సారిపల్లి వెళ్లే రహదారిలో బ్యాంధవాయం లే అవుట్ వద్ద రెండు సీసీ కెమెరాలు భద్రత కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు చాలా గ్రామాల్లో పెద్దలు యువత ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఇంకా కొన్ని గ్రామాల్లో ఈ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఉండడంతో పాటుగా వాటి నివారణ చర్యలు తగిన ఆధారాలు కూడా లభిస్తాయన్నారు.


మందులను సరఫరా చేస్తున్న నాయకులు

పెదకాదలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - దత్తిరాజేరు

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెదకాద గ్రామంలో పశువులకు ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించామని గజపతినగరం పశువైద్య సహాయకులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జాతీయ గోకుల్ మిషన్‌లో భాగంగా 52 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసామని, 16 పశువులకు రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చామని ఆయన బుధవారం తెలిపారు. పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ లలిత, జగదీష్, అవినాష్, సందీప్, టిడిపి మాజీ వైస్ ఎంపిపి పెద్దింటి మోహన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి శేఖర్‌బాబు

ప్రభుత్వ కళాశాలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆర్‌జెడి బి.శేఖర్ బాబు బుధవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికలు, అధ్యాపకులు బోధన విషయాలు అడిగి తెలుసు కున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్య శాఖాధికారి తవిటినాయుడు, ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎం. మధుసూదన రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. మెడికల్ కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణకు వైసిపి అంగీకరించదన్నారు. బుధవారం సాలూరులో తన క్యాంపు కార్యాలయంలో సాలూరు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో సామాన్యులకు వైద్యం అందుబాటులో అందే విధంగా జిల్లాకు ఒక వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీపరం చేస్తే వైసిపి తరఫున తీవ్ర ప్రతిఘటనకు అందరం సిద్ధపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వరుస మరణాలతో ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఉండడానికే భయపడుతున్నారని ఆశ్రమ పాఠశాలలో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించి విద్యార్థులకు అందుతున్న అన్ని రకాల వసతులూ సదుపాయాలను పరిశీలించాలని, సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం తగు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో వైసిపి బూత్ స్థాయి కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రచ్చబండ ద్వారా ప్రజలకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రైవేటు వైద్య కళాశాల ఏర్పాటుకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా వైసిపి మహిళా అధ్యక్షులు రెడ్డి పద్మావతి, వైసిపి కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .


పార్వతీపురంటౌన్.. సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


సాలూరు.. సంతకాల సేకరణ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలతోనే మేలు

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలలతోనే పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం మండలంలోని బాలగూడ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రయివేటీకరణ చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. దీన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. అందుకోసం వైసిపి చేపట్టే సంతకాల సేకరణకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, సర్పంచ్ ప్రతినిధి భూర సూర్యనారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాథం, బంకురు రవికుమార్, వైస్ సర్పంచ్ వర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ పెండ రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి ● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించి, విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్‌రావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా సర్పంచ్ గౌరీశంకరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు స్థానికంగా ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని అన్నారు. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో ఇద్దరు విద్యార్థులకు పచ్చకామెర్లు రావడంతో ముదిరి మరణించారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తల నియామకంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తొలి సంతకం ఏమైందని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, రక్షణ కల్పించాలని కోరారు. ఇరిడి ప్రాథమి పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారిందని చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి వచ్చిన నిధుల మేరకే పనులు చేపట్టామని, పిల్లర్ల స్థాయి వరకు పనులు జరిగాయని తెలిపారు. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతం విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు మండలంలో 116 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని, రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామని చెప్పారు. క్రిమిసంహారక మందులు, వ్యవసాయ యంత్రాలు కావాలని ఎంపిటిసి రమణ కోరారు. ప్రకృతి వ్యవసాయం పట్ల గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని కురుపాం ఎఎంసి ఛైర్‌పర్సన్ కద్రక కళావతి కోరారు. రైతులకు టార్పాలిన్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్‌పై జరిగిన సమీక్షలో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో పశు వైద్య అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పశువులకు వ్యాధులు సోకి మరణిస్తున్నాయని ఎంపిటిసి రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని ఎంపిపి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

లేఅవుట్ల క్రమబద్ధీకరణతో పంచాయతీలకు ఆదాయం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ఆక్రమణలు అరికట్టేందుకు వీలు పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, ప్లానింగ్ అధికారి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న రాము

గ్రీన్ అంబాసిడర్‌కు పాముకాటు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధిలో గ్రీన్‌అంబాసిడర్‌గా పనిచేస్తున్న కూర్మాన రాము పాముకాటుతో అస్వస్థకు గురయ్యాడు. బుధవారం సచివాలయం వెనుక భాగంలో పిచ్చి మొక్కలు రాము తొలగిస్తున్నాడు. ఆ సమయంలో పాము కాటు వేసింది. దీంతో రాము ఒక్కసారి కేకవేయడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు వచ్చి వైద్యం కోసం వీరఘట్టం పిహెచ్‌సికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

స్మార్ట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చల్లంనాయుడు వలస, కోట సీతారాంపురం గ్రామాల్లో బుధవారం స్మార్ట్ రైస్ కార్డులను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లంనాయుడువలస సర్పంచ్ వి.పారమ్మ, టిడిపి నాయకులు పారు నాయుడు, సిహెచ్ కృష్ణ, కెవి సూర్యనారాయణ, డీలర్ కె మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, కోట సీతారాంపురం మాజీ సర్పంచ్ కె.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

వెదురు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో హెచ్‌ఎన్‌టి ఫారం వద్ద ఎపిఎం కమల కుమారి ఆధ్వర్యంలో బుధవారం గిరిజన రైతులకు వెదురు మొక్కలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఒక రైతుకి 60 మొక్కలు చొప్పున మొత్తం మండలంలోని 256 మంది రైతులకు మొక్కలను అందించారు. రైతుకు జీవనోపాధి కల్పించడానికి వెదురు సాగు బాగా ఉపయోగపడుతుందన్నారు. దీనిని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎ చక్రపాణి, సీసీలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దోమపోటు పట్ల జాగ్రత్త


పాచిపెంట.. రైతులతో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి -పాచిపెంట

వరిలో దోమపోటు, ఆకుఎండు, పాము పొడ తెగులు ఆశించాయని, వీటి నివారణకు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, పనుకువలసలో వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమపోటును పిల్ల పురుగులు దశలోనే నివారించుకోవాలని సూచించారు. వందల సంఖ్యలో గుడ్లు పెట్టడం వల్ల ఉధృతి పెరిగితే నివారణ చాలా కష్టమని చెప్పారు. పొట్ట కుళ్ల తెగులు, పాముపొడ తెగులు.. దోమ పోటుతో కలిసి ఉండడం వల్ల పొట్ట నుంచి వెన్ను సరిగ్గా బయటకు రాకుండా తాలుగింజలు ఎక్కువగా ఉండి దిగుబడి బాగా తగ్గుతుందని తెలిపారు. వీటి నివారణకు డైనోటో ఫిరాన్ 250 గ్రాములు, అజాక్సీ స్ట్రోబిన్ 200 మిల్లీ లీటర్ల కలిపి చేను బాగా తడిచేటట్టు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ నాగమణి, విఎఎ లావణ్య పాల్గొన్నారు.

వరిపొలాలు పరిశీలన

కురుపాం : కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అనంత విహారి, స్రవంతి బుధవారం జియ్యమ్మవలస మండలంలో పెదమేరంగి గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుడిదోమ తాకిడి వరి పొలాలకు ఎక్కువగా ఉందని గుర్తించి, నివారణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


కురుపాం.. వరి పొలాలను సందర్శిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

జీడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో హార్టికల్చర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు బుధవారం రైతులకు జీడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి కొమ్మలు దగ్గరగా ఉన్న వాటిని కత్తిరించి, పునరుద్ధరణ చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జీడి తోటలో అంతర పంటలుగా పైనాపిల్, పసుపు సాగువల్ల కొంత ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

చేతుల శుభ్రంతో ఆరోగ్యానికి రక్ష

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి


గుమ్మలక్ష్మీపురం.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గ్లోబల్ హ్యాండ్‌వాష్‌తో ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. వంట చేసిన తర్వాత, ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో కడుక్కుంటే క్రిములను దూరం చేయవచ్చన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తితో ప్రతిఒక్కరూ మూడు పూటలా చేతులను శుభ్రం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, భద్రగిరి సిడిపిఒ విజయగౌరీ, సూపర్‌వైజర్ గౌరమ్మ, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధికారి సుబ్రమణ్యం, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, నాయకులు మండంగి ప్రసాద్, సొంటేనా రాజేష్, మహేశ్వర చిన్న, గౌడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గంగరేగువలస అంగన్వాడీ కేంద్రంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి.సుగుణ కుమారి ప్రజలకు పరిశుభ్రత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శారదాంబ, ఆదిలక్ష్మి, బంగారమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కొమరాడ.. చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు


చెక్కును అందిస్తున్న టిడిపి నాయకులు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన జుత్తాడ సత్య రావునాయుడు కుమార్తె రిషితశ్రీకు వైద్యం నిమిత్తం టిడిపి సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు సిఎం సహాయనిధి చెక్కును బుధవారం విజయనగరం పార్టీ కార్యాలయంలో అందించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచన మేరకు వైద్య చికిత్స ఖర్చులు నిమిత్తం రూ.1.18 లక్షల చెక్కును అందజేసినట్లు కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంఛార్జి రంది చిన్న రామనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గోపిశెట్టి శంకర్రావు, చెక్క గోవింద, పెంట కోటేశ్వరరావు, కాళిదాస్, దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిత్తు

ప్రజాశక్తి - బొబ్బిలి

మాదక ంంంంద్రవ్యాలతో జీవితాలు చిత్తు అవుతాయని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాథ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

లైసెన్స్ లేకుండా టపాసులు అమ్మితే చర్యలు

లైసెన్స్ లేకుండా టపాసులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. టపాసులు షాపులు కోసం తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలని కోరారు. షాపులు వద్ద అగ్నిప్రమాద నివారణ పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణ సిఐ సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రైళ్లలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ వి బాలాజీ రావు తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బలిజిపేట ఎస్ఐ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జి.అర్.పి, పార్వతీపురం అర్‌పిఎఫ్ పోలీసులతో కలిసి పార్వతిపురం రైల్వే స్టేషన్ నుండి విజయనగరం రైల్వే స్టేషన్ వరకు ట్రైన్ ఎర్నాకులం ఎక్స్ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కేరళ రాష్ట్రం అల్పుజ జిల్లాకు చెందిన సుని, గోవిందరాజు అను ఇద్దరు వ్యక్తులు ఒడిశా రాష్ట్రం, మునిగూడ ప్రాంతం నుండి కేరళ రాష్ట్రంకు అక్రమంగా మూడు కేజీల గంజాయిను తరలిస్తుండగా పోలీస్ తనిఖీలలో పట్టుబడ్డారని తెలిపారు. అనంతరం బలిజిపేట ఎస్ఐ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుండి 3 కేజీల గంజాయిని సీజ్ చేసి విజయనగరం జి.అర్.పి. పోలీసులకు అప్పగించగా విజయనగరం రైల్వే ఎస్ఐ వి బాలజీరావు కేసు నమోదు చేసి ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం రైల్వే కోర్ట్‌కు తరలించారు.